లక్ష్యం నెరవేరేనా?

- రోడ్ల వెంట విద్యుత్ వైర్ల కింద మొక్కలు నాటుతున్న పంచాయతీ అధికారులు
- పెరిగాక కొట్టివేస్తున్న విద్యుత్ సిబ్బంది



వనపర్తికి వెళ్లే మార్గంలో విద్యుత్ సిబ్బంది చెట్లను కొట్టివేయడంతో కనిపిస్తున్న మొదళ్లు



ఖిల్లాఘనపురం సమీపంలో వైర్లకు అడ్డుగా వస్తున్నాయని కొట్టించిన చెట్లు

ఖిల్లాఘనపురం: మానవాళికి ప్రాణవాయువును అందించే మొక్కలను పెంచాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం గడిచిన పదేళ్లుగా హరితహారం కార్యక్రమం పేరుతో పెద్ద ఎత్తున మొక్కలు నాటింది. మొదట్లో నాటిన మొక్కలు ప్రస్తుతం చెట్లుగా మారాయి. రోడ్ల వెంట, గ్రామాల్లో, ప్రకృతివనాల్లో చెట్లుగా దర్శనం ఇస్తున్నాయి. కానీ రోడ్లకు ఇరువైపులా నాటిన చెట్లు పెద్దవై విద్యుత్ తీగలకు తగులుతున్నాయని విద్యుత్ అధికారులు కొట్టివేస్తున్నారు.

రోడ్ల అంచున నాటుతున్న వైనం..

పంచాయతీ అధికారులు, ఉపాధి హామీ అధికారులు మొక్కలను రోడ్లకు పక్కన నాటిస్తున్నారు. ఇదేమంటే రైతులు పొలాల్లోకి రావద్దని గుంతలు తీయనివ్వడం లేదని ఇచ్చిన లక్ష్యం పూర్తి చేసే క్రమంలో వారు రోడ్లకు దగ్గరగా మొక్కలు నాటిస్తున్నారు. ఇదే క్రమంలో విద్యుత్ అధికారులు ఒక గ్రామం నుంచి మరో గ్రామానికి వెళ్లే విద్యుత్ లైన్లను రోడ్లకు ఇరువైపులా ఏర్పాటు చేస్తున్నారు. నాటిన మొక్కలు మూడు నాలుగు ఏళ్ల వరకు పెద్ద ఎత్తుకు పెరిగి పైన ఉన్న విద్యుత్ వైర్లకు తగులుతున్నాయి. గ్రామాలకు వెళ్లే వైర్లకు తగలడంతో వర్షం కురిసిన సమయంలో లైన్ ట్రిప్ కావడం జరుగుతుందని తప్పనిసరి పరిస్థితుల్లో చెట్లను కొట్టేస్తున్నట్లు విద్యుత్ అధికారులు చెబుతున్నారు.

ప్రణాళిక ప్రకారం నాటిస్తాం

ముమ్ముందు ఇలాంటి పరిస్థితులు రాకుండా ఓ ప్రణాళిక ప్రకారం మొక్కలు నాటిస్తాం. ఎంపీడీఓ, ఎంపీఓ ఇతర అధికారులతో సమావేశం ఏర్పాటు చేసుకుని వైర్లు ఉన్న చోట చిన్నగా పెరిగే మొక్కలు, వైర్లు లేని చోట పెద్దగా పెరిగే మొక్కలు నాటేలా చర్యలు తీసుకుంటాము. అదేవిధంగా రోడ్లకు దగ్గరగా కాకుండా రైతులతో మాట్లాడి కొంతదూరంగా నాటించేలా చర్యలు తీసుకుంటాం.

– పాండునాయక్, ప్రత్యేక అధికారి, ఖిల్లాఘనపురం

క్లుప్తంగా

ఆలయ కమిటీ చైర్మన్‌గా యుగంధర్‌రెడ్డి



ఆత్మకూర్: మండలంలోని మూలమళ్ల పాండురంగస్వామి ఆలయ కమిటీ చైర్మన్ యుగంధర్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం దేవాయంలో వేదపండితుడు శ్రీధర్‌జ్యోషి ఆధ్వర్యంలో గ్రామస్తులు సమావేశమయ్యారు. ఉపాధ్యక్షులుగా వినయ్‌కుమార్‌రెడ్డి, ఆనంద్‌గౌడ్, కోశాధికారిగా వేణుగోపాల్‌రెడ్డి, గౌరవ అధ్యక్షుడిగా సత్యనారాయణరెడ్డిను నియమించారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం

వనపర్తిటౌన్: జిల్లా కేంద్రంలోని 19వ వార్డు గాంధీనగర్‌లో అనారోగ్యంతో మున్నాశాప్ మృతి చెందారు. బాధిత కుటుంబాన్ని ఆదివారం మున్సిపల్ వైస్ చైర్మన్ కృష్ణ, చీర్ల చందర్ పరామర్శించారు. అనంతరం రూ. 5వేల ఆర్థికసాయాన్ని అందజేశారు.

పీపనగండ్ల: మండలంలోని సంగినేనిపల్లిలో మీసాల రాములు అనారోగ్యంతో ఇటీవల మరణించగా ఆదివారం కుటుంబ సభ్యులకు ఇంద్రకంటి ట్రస్టు ఆధ్వర్యంలో రూ.5వేలు అందజేశారు.

వనపర్తి రూరల్: పెబ్బేరు మండలంలోని వై.శాఖాపూర్ చెందిన పెంచికలపాడు కృష్ణయ్య కొద్ది రోజుల క్రితం మృతి చెందాడు. గ్రామస్తులు స్పందించి రూ.25,400 పోగుచేసి ఆదివారం కుటుంబ సభ్యులకు అందజేశారు.

సైన్స్‌ను అభివృద్ధికి వినియోగించాలి

పాన్‌గల్: నిత్యం వాడే అనేక పరికరాలు సైన్స్ అభివృద్ధి చెందడం మూలాన వచ్చాయనే విషయం గుర్తించి, ఆ సైన్స్‌ను ప్రజల అభ్యున్నతికి వినియోగించాలని జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు నరేందర్, నారాయణ అన్నారు. ఆదివారం మండల జన విజ్ఞాన వేదిక కమిటీ సమావేశానికి వారు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. జన విజ్ఞాన వేదిక సమాజంలో చైతన్యం పెంపొందించడానికి నిరంతరం కృషి చేస్తుందన్నారు. మూఢ నమ్మకాలను తొలగిస్తూ శాస్త్రీయ దృక్పథం నెలకొల్పేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. విద్యార్థులకు సమ్మర్ క్యాంపులు నిర్వహిస్తూ వారు విద్యాపరంగా ఎంతగానో దోహదం చేస్తుందన్నారు. దీంతో పాటు ఉపాధ్యాయులకు కూడా అనేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తూ బోధనను సులభతరం చేయడానికి కృషి చేస్తుందన్నారు. అనంతరం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రమేష్, ప్రధాన కార్యదర్శిగా రవికుమార్, ఉపాధ్యక్షుడిగా ఆకాష్, సభ్యులను ఎన్నుకున్నట్లు వారు పేర్కొన్నారు.

పోచమ్మ విగ్రహావిష్కరణ

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పోచమ్మ తల్లి ఆశీస్సులతో అందరం సంతోషంగా జీవిద్దామని పాలమూరు ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక వార్డు నం.3లోని ఏనుగొండలో పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొని మాట్లాడారు. అర్చకులు ఆయనకు పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. మున్సిపల్ చైర్మన్ ఎ.ఆనంద్‌కుమార్‌గౌడ్, స్థానికులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి

చిన్నచింతకుంట: కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయ కూలీలకు ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని తెలంగాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కడియాల మోహన్ డిమాండ్ చేశారు. అమ్మాపురంలో ఆదివారం కూలీ పోరాటం కరపత్రాలను రైతులకు పంపిణీ చేశారు. వ్యవసాయ కూలీల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఇచ్చిన హామీని వెంటనే నెరవేర్చాలని కోరారు. కూలీలు, రైతులు తదితరులు ఉన్నారు.

సామూహిక యజ్ఞం

గద్వాల టౌన్: ఆర్యసమాజ్ ఆధ్వర్యంలో శ్రావణమాస సామూహిక యజ్ఞం వైభవంగా నిర్వహించారు. ఆదివారం స్థానిక దయానంద విద్యామందిర్‌లో జరిగిన యజ్ఞంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఆర్య సమాజ్ ప్రతినిధి విట్టల్ రావు ఆర్య, వైదిక ధర్మ ప్రచారకురాలు, మాజీ డీఎస్పీ నళిని పాల్గొని పూజలు నిర్వహించారు. యజ్ఞ బ్రహ్మ అంటూ... దంపతులతో యజ్ఞ కార్యక్రమాలు చేయించారు.

'హరితహారం' మొక్కల తొలగింపు



వ్యాపార సముదాయాల కోసం తొలగించిన హరితహారం మొక్కలు

పీపనగండ్ల: మండల కేంద్రంలో హరితహారం మొక్కలను తొలగించి వ్యాపార సముదాయాలను ఏర్పాటు చేసుకుంటున్నా అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదు. ఎంపీడీఓ కార్యాలయానికి సమీపంలో ప్రధాన రహదారిపై కొన్ని రోజులుగా వ్యాపార సముదాయాల ఏర్పాటు కోసం రోడ్డు పక్కన నాటిన మొక్కలను కొందరు తొలగించారు. అధికారులు స్పందించి మొక్కలను రక్షించే చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బీపీ మండల్‌కు ఘన నివాళి



చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

వనపర్తిటౌన్: బీసీ వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన బీపీ మండల్ యాదవ్ సేవలు మరువలేనివని మహనీయుల స్ఫూర్తి వేదిక చైర్మన్ రాజారామ్‌ప్రకాశ్ పేర్కొన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో బీపీ మండల్ 106వ జయంతి సందర్భంగా చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో కవులు గిరిరాజాచారి, డాక్టర్ నాయకంటి నర్సింహాశర్మ, దేవన్న నాయుడు, బాలేమియా, యోసోఫ్, వెంకటస్వామి, వెంకటేష్, నర్సింహ, బక్కయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బద్రోద్దీన్ షావలి గంధోత్సవం



దర్గాకు పూలు సమర్పిస్తున్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి



దర్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న గ్రామస్తులు

ఖిల్లాఘనపురం: మండలంలోని తిర్మలాయపల్లి శివారులో బద్రోద్దీన్ షావలి గంధోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. దర్గా ముతవల్లి బద్రోద్దిన్ సాహెబ్ ఇంటి నుంచి గంధంతో ఊరేగింపుగా దర్గా వరకు వెళ్లారు. దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి హాజరై దర్గాలో పూలు సమర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కులమతాలకు అతీతంగా ప్రజలంతా ఐక్యంగా పండుగలు చేసుకోవాలన్నారు. సోమవారం ఉర్సు ఉంటుందని ముతవల్లి తెలిపారు.

భక్తిశ్రద్ధలతో బోనాల పండుగ

ఖిల్లాఘనపురం: మండలంలోని రోడ్డుమీదితండాలో ఆదివారం పోచమ్మ బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారికి పూజలు నిర్వహించిన తండావాసులు సాయంత్రం అందంగా తయారు చేసిన బోనంలో నైవేద్యాన్ని ఊరేగింపుగా తీసుకెళ్లారు. అమ్మవారికి బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.



బోనాలతో వెళ్తున్న మహిళలు

సాగునీటి కాల్వలకు నీరందించండి



మాట్లాడుతున్న అబ్రహం

అమరచింత: మండలంలోని పామిరెడ్డిపల్లె, కొంకన్నానిపల్లెకు సంగంబండ, భూత్పుర్ రిజర్వాయర్‌ల కాల్వలు ఉన్నా నీళ్లు రాక భూములు బీళ్లుగా మారాయని సీపీఐ మండల కార్యదర్శి అబ్రహం అన్నారు. కొంకన్వానిపల్లెలో ఆదివారం మండల సీపీఐ నాయకుల సమావేశంను నిర్వహించి అక్కడి సంగంబండ కాల్వను పరిశీలించారు. మాజీ సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి హయంలో గ్రామాల వరకు కాల్వలను తవ్వారన్నారు. ఇప్పటి వరకు సాగునీరు కాల్వల వెంట రాకపోయిన ప్రస్తుత పాలకులు పట్టించుకోకపోవడం శోచనీయం అన్నారు. కొంకన్వానిపల్లె శివారులో రైతులకు 2,800 ఎకరాలు, పామిరెడ్డిపల్లెలో 1,500 ఎకరాల భూములు ఉన్నాయన్నారు. కాల్వల ద్వారా సాగునీరు వస్తే ఏడాదికి రెండు పంటలు పండించుకునే అవకాశం ఇక్కడి రైతులకు ఉందన్నారు. స్థానిక ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి స్పందించి గ్రామాల మీదుగా ఉన్న కాల్వల ద్వారా సాగునీరు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామాలలో ప్రత్యేక అధికారుల పాలనలో పారిశుద్ధ్య పనులు మరుగునపడ్డాయని దోమలు పెరిగిపోవడం, మురుగు కాల్వలు నిండుకోవడంతో ప్రజలు విష జ్వారాల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మల్లేష్, కుతుబ్, వెంకటేష్, అంజి పలువురు పాల్గొన్నారు.

ఎంబీబీఎస్ విద్యార్థికి సాయం



నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

కొత్తకోట రూరల్: మండలంలోని అప్పరాల చెందిన నర్కుల ఆంజనేయలు కుమారుడు అరుణ్‌కుమార్ తమిళనాడు రాష్ట్రంలోని మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు వచ్చింది. నిరుపేద కుటుంబానికి చెందిన అరుణ్‌కుమార్ చదువుకు అయ్యే ఖర్చుల నిమిత్తం స్థానిక కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి రూ.25వేలు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శేఖర్‌రెడ్డి, బీచుపల్లియాదవ్, కేశవులు తదితరులు ఉన్నారు.

ఆరోగ్య కేంద్రానికి నీటి ఇక్కట్లు

పాన్‌గల్: మండల కేంద్రంలోని పీహెచ్‌సీకి నీటి సరఫరా చేసే బోరు మోటారు చెడిపోవడంతో నీటి సరఫరా నిలిచిపోయింది. ఆస్పత్రిలో మూత్రశాలలకు వెళ్లాలన్న నీరు లేకపోవడంతో రోగులు ఆరుబయటకు వెళ్లే పరిస్థితి నెలకొంది. మోటరును మరమ్మతు చేయించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోనే ఈ సమస్య పరిష్కారంలో జాప్యం జరుగుతుందని రోగులు వాపోతున్నారు. విషయంపై పీహెచ్‌సీ డాక్టర్ చంద్రశేఖర్‌ను వివరణ కోరగా విషయాన్ని ఎంపీడీఓ దృష్టికి తీసుకెళ్లామని, మరమ్మతు చేయిస్తామన్నారు. ప్రత్యామ్నయంగా పీహెచ్‌సీలోని సంపులో మిషన్ భగీరథ నీరు నింపి వాడుతున్నామని తెలిపారు.



మరమ్మతుకు గురైన బోరు మోటారు

వసతిగృహంలో సమస్యలు పరిష్కరించండి



విద్యార్థులతో మాట్లాడుతున్న పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్

అమరచింత: మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ డిమాండ్ చేశారు. ఆదివారం వసతి గృహాన్ని సందర్శించి విద్యార్థులతో కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వసతిగృహం ప్రహరీ లేనందును పశువులు, మేకలు వస్తున్నాయన్నారు. విద్యార్థులకు సబ్బుల బిల్లులు రాలేదని తెలిపారు. నోట్ పుస్తకాలు, బూట్లు ఇవ్వాలన్నారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించడం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో జనార్దన్, రాకేష్, శివ, అనిల్ పలువురు పాల్గొన్నారు.

బస్తీ దవాఖానాకు సుస్తీ



కొత్తకోటలో మూతబడిన బస్తీ దవాఖాన

వైద్యుడు లేక నిరుపయోగంగా మారిన వైనం

కొత్తకోట రూరల్: పట్టణ కేంద్రంలోని మదనాపురం రోడ్డులో ఏర్పాటు చేసిన బస్తీదవాఖానాకు సుస్తీ చేసింది. ఆవరణ మొత్తం డంపింగ్‌యార్డుగా మారిందని పట్టణ వాసులు వాపోతున్నారు. గత ప్రభుత్వం కరోనా సమయంలో బస్తీ దవాఖాన ఏర్పాటు చేయడం జరిగింది. ఇందుకు డాక్టర్, సిబ్బందిని నియమించారు. ప్రతి రోజు ముస్లింపురియా, ఎస్సీ కాలనీ, గణేష్‌నగర్ కాలనీ, వీవర్స్ కాలనీ నుంచి 40 నుంచి 50మంది దాకా వచ్చి చికిత్స చేయించుకునేవారు. ఏమైందో ఏమో కానీ ఏడాది నుంచి ఇక్కడకు డాక్టర్ రాకపోవడంతో ఆశా వర్కర్ మాత్రమే ప్రతి రోజు వచ్చి తలుపులు తెరిచి సాయంత్రం ఇంటికి వెళ్తుంది. బస్తీదవఖానాలో డాక్టర్ లేకపోవడంతో రోగులు రావడం లేదు. దీంతో ఆవరణలో వెలుగు కార్యాలయానికి సంబంధించిన పనిముట్లతో పాటు చెత్తాచెదారం, కంకర ఉండటంతో డంపింగ్ యార్డుగా తయారైంది. అంతే కాకుండా ఇదే భవనంలో దివ్యాంగుల పునరావస కేంద్రం, రెండు నెలల క్రితం ఏర్పాటు చేసిన మహిళా కుట్టు కేంద్రం కొనసాగుతున్నాయి. అసలే సీజనల్ వ్యాధులతో పట్టణ వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి డాక్టర్‌ను ఏర్పాటు చేసి సరైన మందులు అందుబాటులో ఉంచాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

అధికారుల నిర్లక్ష్యం.. ప్రయాణికులకు శాపం



రైల్వే గేట్ వద్ద రోడ్డును మూసివేసిన అధికారులు

దేవరకద్ర రూరల్: అధికారుల నిర్లక్ష్యం– ప్రజలకు శాపంగా మారింది. వివరాల్లోకి వెళ్తే.. కౌకుంట్ల మండల పరిధిలోని వెంకటగిరి రైల్వే స్టేషన్ సమీపంలో ప్రధాన రహదారి వద్ద ఉన్న రైల్వే గేట్‌ను మూసివేసి, అండర్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. అందుకోసం దాదాపు 6 నెలల క్రితం ఎలాంటి రాకపోకలు కొనసాగకుండా, పనులు పూర్తి అయ్యే వరకు అక్కడ ఉన్న రహదారిని మట్టి వేసి పూర్తిగా మూసివేశారు. ప్రయాణం కోసం వెంకటగిరి– పేరూర్ గ్రామాల మీదుగా ప్రత్యామ్నయంగా మట్టి రోడ్డును ఏర్పాటు చేశారు. ఆత్మకూర్, కొత్తకోట వంటి పట్టణాలతో పాటు అన్ని గ్రామాలకు చేరుకునేందుకు ఈ దారే ప్రధాన ఆధారం. దీంతో నిత్యం వందల సంఖ్యలో వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటుంది. అయితే ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో రోడ్డు మొత్తం పెద్ద పెద్ద గుంతలు ఏర్పాడ్డాయి. పూర్తిగా బురదమయంగా మారింది. కనీసం ద్విచక్ర వాహనాలు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో వాహనదారులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను పరిష్కరించాలని అధికారులకు ఎన్ని సార్లు మొరపెట్టుకున్నా స్పందించడం లేదని వాపోతున్నారు. ఆరు నెలలు గడిచినా ఇప్పటివరకు అండర్ బ్రిడ్జి పనులు కూడా ప్రారంభం కాలేదని చెబుతున్నారు. ఇప్పటికైనా సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

మార్షల్ ఆర్ట్స్‌తో దేహదారుఢ్యం

మహబూబ్‌నగర్ క్రీడలు: కరాటే, మార్షల్ ఆర్ట్స్‌తో దేహదారుఢ్యంతోపాటు మానసికంగా ఎదగవచ్చని జీకే మాస్టర్ షోటోకాన్ కరాటే డూ ఇండియా చీఫ్ జి.క్రిష్ణయ్య అన్నారు. జిల్లా కేంద్రం కుర్తినిశెట్టికాలనీలోగల అక్షర స్కూల్‌లో ఆదివారం జీకే షోటోకాన్ పట్టణ అధ్యక్షుడు, మాస్టర్ రాజు ఆధ్వర్యంలో కరాటే బెల్టు గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా క్రిష్ణయ్య పాల్గొని మాట్లాడారు. ప్రస్తుతం కరాటే మార్షల్ ఆర్ట్స్‌కు ఎంతో ప్రాధాన్యత ఏర్పడిందన్నారు. స్వీయరక్షణ కోసం కరాటే నేర్చుకోవాలని కోరారు. కరాటే మాస్టర్ రాజు మాట్లాడుతూ బెల్టు గ్రేడింగ్ పరీక్షల్లో 13 మంది విద్యార్థులు పాల్గొనగా వివిధ బెల్టులు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.





కొత్తకోట స్ఫూర్తి పాఠశాలలో..



కొత్తకోట భారతీయ విద్యామందిర్‌లో..

ఉత్సాహంగా కృష్ణాష్టమి

సాక్షి, నెట్‌వర్క్: కృష్ణుడు, గోపికల వేషధారణలతో పట్టణంలోని పలు ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు అలరించారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పాఠశాలల్లో కృష్ణాష్టమి వేడుకలను నిర్వహించారు. కోళాటాల నృత్యాలు చేశారు. అనంతరం విద్యార్థులతో ఉట్టి కొట్టించారు.



వనపర్తి బ్లాసమ్స్ ప్లేవే పాఠశాలలో..